


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శుక్రవారం 20 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 291 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## రైతు ఉత్సవాలకు సీఎం, డిప్యూటీ సీఎంను ఆహ్వానించిన మంత్రి తుమ్మల

సందేశం టైమ్స్, జూబ్లీహిల్స్, మార్చి 20, ప్రతినిధి: రాష్ట్రంలో నిర్వహించనున్న "ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు" కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కలిసి ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా "ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు" నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22న జరిగే రైతు ఉత్సవాల వేదికగా రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేయనుందని అధికారులు తెలిపారు.

## రవీంద్రభారతిలో ఉగాది వేడుకలు పంచాంగం పంచాంగావిష్కరణ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

### ఉగాది వేడుకల్లో రైతు సంక్షేమమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 20, ప్రతినిధి: రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం రైతు నామ సంవత్సరమని, తెలంగాణలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజుగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నామని, రాష్ట్రంలో 70 శాతం కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశామని, రైతు భరోసా కోసం రూ.18 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఈ నెల 22న మరోసారి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ధరణి స్థానంలో భూ భారతితో భూసమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యమని, ప్రకృతి వైపరీత్యాల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

## ప్రపంచంలో ముద్ర వేస్తున్న మేడ్ ఇన్ ఇండియా




సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 20, ప్రతినిధి: "మేడ్ ఇన్ ఇండియా" ఇప్పుడు కేవలం ఒక ట్యాగ్ మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నమ్మకానికి ప్రతీకగా మారుతోంది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో 32 శాతం వృద్ధి నమోదు కావడంతో పాటు 38.58 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవడం ద్వారా భారత్ ప్రపంచానికి పెద్ద సరఫరాదారుగా అవతరిస్తోంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల కనిపించగా, అమెరికా సహా అనేక దేశాల్లో భారత ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. కొత్త మార్కెట్లలో కూడా భారత్ బలమైన స్థానం సంపాదిస్తూ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోంది. ఈ పరిణామాలతో భారత్ కేవలం వినియోగ మార్కెట్ మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా ఎదుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## సాదా బైనామా భూములకు త్వరలో పరిష్కారం: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 20, ప్రతినిధి: తెలంగాణలో సాదా బైనామా భూములకు సంబంధించి త్వరలోనే పరిష్కారం చూపించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ సందర్భంగా ప్రకటించారు. రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్న ఆయన ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ధరణి స్థానంలో భూ భారతితో భూసమస్యలను పరిష్కరిస్తున్నామని, సాదా బైనామా సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నామని, ఈ నెల 22న రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,616 కోట్ల మేరకు రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నామని, ఇప్పటికే రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధర, రైతు బీమా వంటి పథకాల ద్వారా రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేయగా, వివిధ ఆలయాల అర్చకులను ముఖ్యమంత్రి సత్కరించారు.

## ఇరాన్ చేతుల్లో ఇంటర్నెట్ బ్రహ్మాస్త్రం ప్రపంచానికి ముప్పు?

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 20, ప్రతినిధి: ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు కీలకమైన సముద్రపు ఫైబర్ కేబుళ్లపై పెరుగుతున్న భద్రతా ఆందోళనలు అంతర్జాతీయంగా కలవరపెడుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌తో సంబంధిత ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరగడంతో, ఈ కేబుళ్లు దెబ్బతింటే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ డేటా ట్రాఫిక్‌లో 95 శాతానికి పైగా ఈ సముద్రపు కేబుళ్ల ద్వారానే ప్రసారం అవుతుండగా, మధ్యప్రాచ్య ప్రాంతంలో జరిగే యుద్ధాలు, దాడులు, ప్రమాదాలు వీటికి పెద్ద ముప్పుగా మారుతున్నాయి. ఇటీవల రెడ్ సీ ప్రాంతంలో జరిగిన ఘటనల్లో కేబుళ్లు దెబ్బతినడంతో ఆసియా, యూరప్ మధ్య డేటా ట్రాఫిక్‌లో సుమారు 25 శాతం అంతరాయం ఏర్పడినట్లు నివేదికలు వెల్లడించాయి. అలాగే స్ట్రైట్ ఆఫ్ హోర్ముజ్ వంటి ప్రాంతాలు కూడా కీలక డిజిటల్ మార్గాలుగా ఉండటంతో అక్కడ ఉద్రిక్తతలు పెరగడం గ్లోబల్ ఇంటర్నెట్‌కు ప్రమాదకరంగా మారుతోంది.ఇక ఇరాన్‌లో గతంలో జరిగిన నిరసనల సమయంలో ప్రభుత్వం పూర్తిస్థాయి ఇంటర్నెట్ షట్‌డౌన్ అమలు చేయడం, అవసరమైతే 'ఇంటర్నెట్ కిల్ స్విచ్' ఉపయోగించగల సామర్థ్యం ఉన్నదనే భయాలను మరింత పెంచుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఒకేసారి కీలక కేబుళ్లు దెబ్బతింటే లేదా యుద్ధ పరిస్థితుల్లో మరమ్మతులు ఆలస్యమైతే, ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్, కమ్యూనికేషన్, డిజిటల్ సేవలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో "ఇంటర్నెట్ బ్రహ్మాస్త్రం"గా భావిస్తున్న ఈ డిజిటల్ మౌలిక వసతుల భద్రత ఇప్పుడు ప్రపంచ దేశాలకు కీలక సవాల్‌గా మారింది.

## గజ్వేల్‌లో టిఆర్పి ప్రభావం పెరుగుతోంది భారీగా చేరికలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 20, ప్రతినిధి: గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) ప్రభావం వేగంగా విస్తరిస్తుండగా, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలకు రాజీనామా చేసి టిఆర్పిలో భారీగా చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో చేరికలు ఘనంగా నిర్వహించగా, చేరిన వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ గజ్వేల్‌లో త్వరలోనే టిఆర్పి నాయకుల విస్తృత స్థాయి సమావేశంతో పాటు భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు, బీసీల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత బలంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీలపై ఎక్కడైనా అన్యాయం జరిగినా ఐక్యంగా నిలబడి, విభేదాలు పక్కనపెట్టి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అధిపత్య వర్గాల దోపిడీకి ముగింపు పలికి బీసీ వర్గాలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణ, సమానత్వ సమాజ నిర్మాణం కోసం టిఆర్పి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, గజ్వేల్ ప్రాంతానికి చెందిన ప్రముఖులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కవితకు దిల్లీ హైకోర్టులో ఊరట




సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 20, ప్రతినిధి: పార్టీ నమోదు వ్యవహారంలో కల్వకుంట్ల కవితకు దిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీ నమోదు అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి కోర్టు సూచించింది. గతంలో కవిత దాఖలు చేసిన దరఖాస్తులో సాంకేతిక లోపాలున్నాయని ఎన్నికల సంఘం పేర్కొనగా, ఆ లోపాలను సరిచేసి మళ్లీ దరఖాస్తు సమర్పించినట్లు కవిత తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం వెల్లడించింది.

## నాగిరెడ్డిపల్లిలో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం



సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండల నాగిరెడ్డిపల్లి గ్రామంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు, యువజన సంఘాల నాయకులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఉగాది పచ్చడి సాంప్రదాయాన్ని పాటిస్తూ పంచి, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా పాల్గొని ఉత్సాహభరితంగా వేడుకలను జరుపుకున్నారు.



## మీర్జంపల్లి తండాలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ఘనంగా

సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలంలోని మీర్జంపల్లి తండాలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హాజరైన జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అస్మా రిబ్బన్ కట్ చేసి కిరణ్ బాయి కృష్ణ గారి కొత్త గృహంలో ప్రవేశింపజేశారు. ఈ సందర్భంగా గృహ యజమానులు రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుభాష్, ఉప సర్పంచ్ సుబాష్, మొగుడంపల్లి సర్పంచ్ రాజు, గౌసాబాద్ తండా సర్పంచ్ నారాయణ, మహిళా నాయకురాళ్లు మారుణి బాయి, సీతా బాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాత రామచంద్రపురం ఈద్గాలో 2000 మందికి ఇఫ్తార్ విందు




సందేశం టైమ్స్ మార్చి 20 సంగారెడ్డి ( సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండల పరిధిలోని GHMC 111, 112 డివిజన్లలో పాత రామచంద్రపురం ఈద్గాలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కపూర్ సింగ్ తన సొంత నిధులతో సుమారు 2000 మంది ముస్లిం మైనార్టీ సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల ఉపవాస దీక్ష అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు హిందూ-ముస్లిం ఐక్యతను ప్రతిబింబిస్తూ గంగ-జమున తహజీబ్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. అదేవిధంగా అబ్బు అలీ ఖురేషి సహా మైనార్టీ పెద్దలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారిని కపూర్ సింగ్ ఆహ్వానించి, సోదరభావంతో విందు నిర్వహించారు.

## తిమ్మినేనిపాలెంలో రంజాన్ తోఫా పంపిణీ




సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామంలో ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేదలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం మండల అధ్యక్షుడు షేక్ జానీమియా, కార్యదర్శి షేక్ మీరాసాహెబ్ పాల్గొని అవసరమైన వారికి తోఫాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ముస్లిం సోదరులు షేక్ మదర్ సాహెబ్, షేక్ అబ్బా సల్లి, షేక్ నజీర్, సయ్యద్ జానీ పాషా, మౌలాస, షేక్ జాజిల్ తదితరులు పాల్గొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు సహాయం చేయడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

## పురుగుల మందు తాగి యువకుడు మృతి కుటుంబంలో విషాదం



సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 20, ప్రతినిధి: ఖమ్మం జిల్లా లక్కవరం గ్రామానికి చెందిన మాదాసు సాయి ప్రవీణ్ (24) అనే యువకుడు పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, కొద్ది రోజులుగా పని లేకుండా తిరుగుతున్న సాయి ప్రవీణ్‌ను అతని భార్య ప్రవర్తన మార్చుకోవాలని సూచించగా, మనస్థాపానికి గురైన అతడు ఈ నెల 13న రాత్రి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లి పొలంలో మిగిలి ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 18న ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, 17 నెలల బాబు ఉన్నారు. మృతుడి బావ సోమపంగి ఉపేందర్ ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.




## ఉగాది పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి, భగవంతుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల బ్రోచర్ ఆవిష్కరణ

సందేశం టైమ్స్, హన్మకొండ, మార్చి 20, ప్రతినిధి: స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల బ్రోచర్‌ను వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హన్మకొండ కనకదుర్గ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అలాగే కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, టీఎస్కేసీ ద్వారా ఉద్యోగావకాశాలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, పోటీ పరీక్షల మార్గదర్శకత్వం వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి మరియు అధ్యాపకులు నాగరాజు, సుమలత, అఖిల తదితరులు పాల్గొన్నారు.



## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

సందేశం టైమ్స్, వరంగల్, మార్చి 20, ప్రతినిధి: పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు ప్రజల కొత్త సంవత్సర ఆరంభానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఇంటిలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి నెలకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కోరుకున్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగాది సందర్భంగా ప్రతి ఒక్కరూ సాంప్రదాయాలను పాటిస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## వివో భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ




సందేశం టైమ్స్, మానకొండూర్, మార్చి 20, ప్రతినిధి: మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామంలో నూతన వివో భవన నిర్మాణ పనులకు గౌరవ ఎమ్మెల్యే మరియు టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ భవనం నిర్మాణంతో స్థానికులకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉగాది కానుకగా 10,060 ప్రభుత్వ ఉద్యోగాలు: సీఎం ప్రకటన




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి ౨౦, ప్రతినిధి: జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ౨౧ నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ౬ లక్షల పైచిలుకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనతో ఈ ఏడాది ప్రైవేటు రంగంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరగనుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ౧౦,౦౬౦ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి మే ౧౫ నుంచి అక్టోబర్ ౧౫ వరకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగార్థులు సన్నద్ధతతో, ప్రతిభతో ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.




# పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు జూన్ 9 న ఓటింగ్... ప్రతి ఓటు కీలకం

సందేశం టైమ్స్, పుదుచ్చేరి, మార్చి 20, ప్రతినిధి: పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రజలు ఏప్రిల్ 9, 2026 న ఓటు హక్కును వినియోగించడానికి సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల కమిషన్ (ECI) ప్రతి ఓటరు స్వరాన్ని వినిపించేలా చర్యలు చేపట్టింది. వృద్ధులు, వృద్ధాపరులు, దివ్యాంగులు, సర్వీస్ ఓటర్లు మరియు పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించడం ద్వారా ఎన్నికల్లో ప్రతి ఓటు విలువను నిర్ధారిస్తోంది. "ప్రతి ఓటు ముఖ్యం" అని ఎన్నికల కమిషన్ పౌరుల్ని పిలుపునిచ్చింది.ప్రజలు సజాగ్రతగా, సక్రమంగా ఓటు హక్కును వినియోగించాలనేది ఎన్నికల కమిషన్ ప్రధాన మార్గనిర్దేశకం.

# ఉసిరికపల్లిలో ముస్లిం సోదరులకు ఈద్ కా తోఫా పంపిణీ




సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి ౨౦, ప్రతినిధి: వట్పల్లి మండల కేంద్రంలో ఉసిరికపల్లి గ్రామంలో రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఈద్ కా తోఫా కానుకలను గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, యువకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని ఐక్యతను చాటారు. సర్పంచ్ ఈ సందర్భంగా రంజాన్ పండుగ సోదరభావం, సేవా భావానికి ప్రతీక అని తెలిపారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ సామరస్య వాతావరణంలో సాగింది.

# పెద్ద రెడ్డిపేటలో సిద్దేశ్వర జాతరలో ఎడ్లబండ్ల ఊరేగింపు ఘనంగా



సందేశం టైమ్స్, పుల్కల్, మార్చి 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ పెద్ద రెడ్డిపేట గ్రామంలో సిద్దేశ్వర జాతర మహోత్సవం సందర్భంగా ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల గుండా సాంప్రదాయ అలంకరణలతో సిద్దేశ్వర స్వామి విగ్రహాన్ని ఎడ్లబండ్లపై ప్రతిష్టించి ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు భారీగా పాల్గొని హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమంలో నూతన సంవత్సర విశేషాలను పురోహితులు వివరించగా, భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయబడ్డాయి. ఆలయం పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలను విజయవంతం చేశారు. కార్యక్రమం మొత్తం భక్తి వాతావరణంలో సాగి గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# పెద్దారెడ్డిపేట 4వ వార్డులో సీసీ రోడ్డు, మొరిలకు శంకుస్థాపన



సందేశం టైమ్స్, పుల్కల్, మార్చి ౨౦, ప్రతినిధి: పుల్కల్ మండలం ఎస్. మహేష్ బాబు: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామంలోని ౪వ వార్డులో ఉగాది సందర్భంగా సీసీ రోడ్డు మరియు మురికి మొరిల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కుమ్మరి అనసూజ లింగయ్య శంకుస్థాపన చేశారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యకు పరిష్కారం దిశగా ౧౧౦ మీటర్ల సీసీ రోడ్డు, ౧౭౦ మీటర్ల మొరిల నిర్మాణ పనులు ప్రారంభించబడ్డాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీ రామ యంత్రం ప్రతిష్ఠాపన రామరాజ్యానికి ఆధ్యాత్మిక ఆరంభం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి ౨౦, ప్రతినిధి: విక్రమ సంవత్ ౨౦౮౩ నూతన సంవత్సర శుభ సందర్భంలో శ్రీ రామ జన్మభూమి మందిరంలో పూజ్య సద్గురు-సన్యాసుల పావన సాన్నిధ్యంలోని ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారి చేతుల ద్వారా "శ్రీరామ యంత్రం" ప్రతిష్ఠించబడింది. ఈ దివ్య సందర్భం సనాతన చైతన్యానికి స్పందనగా నిలవడం విశ్వాసానికి వెలుగు నింపుతూ, రామరాజ్యపు ఆధ్యాత్మిక అనుభూతిని ప్రసాదించింది. ([శ్లోకం] "యదపి సబు వైకుంఠ బఖానా, వేద పురాణ విదిత జగ్ జానా, అవధపురి సమ ప్రియ నహి సోఊ, యహ ప్రసంగ జానై కోఊ కోఊ") – ఈ పవిత్ర సందర్భం భక్తి, సాంస్కృతిక ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తోంది.



# వట్‌పల్లిలో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం

సందేశం టైమ్స్, వట్‌పల్లి, మార్చి ౨౦, ప్రతినిధి: వట్‌పల్లి మండల్ దుద్యాల గ్రామంలోని శ్రీ సర్వేశ్వరపురి ఆశ్రమంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. వట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల భక్తులు పంచాంగ శ్రవణ కార్యక్రమాలలో పాల్గొని కొత్త సంవత్సరానికి సంబంధించిన ఫలితాలు, శుభాశుభాలను పండితుల వివరణతో ఆసక్తిగా తెలుసుకున్నారు. సర్వేశ్వర ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మాటాధిపతి శ్రీహరి సర్వేశ్వర స్వామి భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం పురోహితుడు విజయ్ పంచాంగ శ్రవణం నిర్వహించి నూతన సంవత్సర విశేషాలను వివరించారు. ఆశ్రమ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమంలో నవభారత్ రాష్ట్ర ఇన్‌చార్జి మన్నే పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# నల్లపోచమ్మ దేవాలయంలో ఉగాది పచ్చడి పంపిణీ



సందేశం టైమ్స్, మనూర్, మార్చి ౨౦, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండల్ బోరంచ గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో నూతన సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి ఆలయానికి వచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు "ఓం శ్రీమాత్రే నమః" నినాదాలతో దేవిని ప్రార్థిస్తూ కొత్త సంవత్సరానికి శుభారంభం చేసుకున్నారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి.

# పరాభవ నామ సంవత్సరంలో శుభాలే అధికం పంచాంగ శ్రవణంలో ఆనంద్ శర్మ



సందేశం టైమ్స్, అందోల్, మార్చి ౨౦, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్‌లోని కన్‌సాన్‌పల్లి గ్రామ హనుమాన్ దేవాలయంలో నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా పురోహితుడు ఆనంద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం నిర్వహించారు. పరాభవ నామ సంవత్సరంలో ఎక్కువగా శుభ ఫలితాలే చోటుచేసుకుంటాయని, ప్రజలు ప్రేమాభిమానంతో సంతోషంగా జీవిస్తారని ఆయన తెలిపారు. ఈ ఏడాది గురువు రాజుగా, కుజుడు మంత్రిగా ఉండడం వల్ల మంచి లక్షణాలు పెరుగుతాయని, కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తతలు ఉండే అవకాశం ఉన్నా ప్రజలు ధర్మ మార్గంలో నడుస్తారని చెప్పారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండతాయని, ముఖ్యంగా పత్తి, వరి, పసుపు, శెనగ పంటల మంచి దిగుబడులు ఉంటాయని వివరించారు. అలాగే ప్రమాదాలు తగ్గి దేశ కీర్తి, ప్రతిష్టలు పెరుగుతాయని, పశుపక్షాదుల పట్ల ఆదరణ పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, భజరంగ్ దళ్ సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజిలీపూర్‌లో రంజాన్ కానుకల పంపిణీ – మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: అరవింద్



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మార్చి ౨౦, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా బిజిలీపూర్ గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించి ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న ఈద్ కా తోఫా కానుకలను యువజన కాంగ్రెస్ మండల నాయకుడు అరగొండ అరవింద్ మాజీ ఎంపిటీసీ సంగప్పతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ పండుగ ప్రేమ, దయ, త్యాగానికి ప్రతీకగా ఉండి సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని మరింత బలపరిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, రూ.౨ లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.౫౦౦కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, సన్న వడ్లకు రూ.౫౦౦ బోనస్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.౧౦ లక్షలకు పెంపు, రైతు భరోసా పెంపు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర నాయకత్వంలో అందోలు నియోజకవర్గ అభివృద్ధికి భారీ నిధులు కేటాయించి రహదారుల అభివృద్ధి, నర్సింగ్ కళాశాల, మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శంకర్, శ్రీనివాస్, నర్సింలు, కుమార్, విఠల్, మల్లేశం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# నమ్మిన ప్రజల కోసం బోరు వేసిన శంశోద్దినపూర్ సర్పంచ్ నరేష్ కుమార్



సందేశం టైమ్స్, రాయికోడ్, మార్చి 20, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం శంశోద్దీన్ పూర్ గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని, తన గ్రామ ఆడపడుచులు ఇబ్బంది పడకుండా ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి, గ్రామంలోని మంచినీళ్ల బావిలో నూతన మోటార్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ఉపకారం చేకూర్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుకరం, గ్రామ పెద్దలు పి. నారాయణ, తోపాలా రాములు, నాగభూషణం, యస్. రాజు, వార్డు సభ్యులు రాములు, హోటల్ వీరేశం, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జై బీసీ: ఎల్.బీ. నగర్‌లో బీసీ ఆత్మగర్జన మహాసభ




సందేశం టైమ్స్, హైదరాబాదు, మార్చి 20 – ఏప్రిల్ 4, 2026 (శనివారం) ఉదయం 10:30 గంటలకు ఎల్.బీ. నగర్, చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్ వేదికపై B.C. రాజ్యాధికార వేదిక ఆధ్వర్యంలో RGV MEDIA సౌజన్యంతో బీసీ ఆత్మగర్జన మహాసభ ఘనంగా నిర్వహించబడనుంది.

ఈ సభలో బీసీ వర్గాల విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కళేషుకులు, ఉద్యోగులు, మహిళలు, యువకులు భారీగా పాల్గొని తమ సత్తాను చాటతారు. బీసీ వర్గాల జీవితాలను ఇంకా అణచివేతకు గురిచేసిన గత పరిస్థితులను గుర్తుచేస్తూ, రాజ్యాధికార సాధన, ఉద్యోగాలు, ఆర్థిక స్వావలంబన కోసం ఈ సభలో నిరంతర చర్చలు, ఆవేశభరిత నినాదాలు జరుగుతాయి.

ప్రధాన డిమాండ్లు:

జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి.

స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంట్‌లో బీసీల రిజర్వేషన్ నిరంతరం అమలు చేయాలి.

బీసీ సబ్ ప్లాన్ తక్షణమే అమలు చేయాలి.

బీసీ కార్పొరేషన్లకు అధిక నిధులు కేటాయించాలి.

విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలి.

కార్పొరేట్ తరహాలో బీసీ విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యం అందజేయాలి.


బీసీ కుల గణన చేపట్టాలి.

ప్రైవేట్ పరిశ్రమల్లో బీసీలకు ఉద్యోగాలు కల్పించాలి.

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి కల్పించాలి.

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో 90% సబ్సిడీపై లోన్లు అందించాలి.

ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సమాచార రంగాల్లో బీసీలకు తగిన వాటా ఇవ్వాలి.బీసీ రైతుల సాగు పంటలకు ప్రభుత్వ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.ఈ మహాసభ బీసీల ఐక్యత, హక్కుల సాధన, ఆర్థిక-రాజకీయ శక్తిని ప్రతిబింబించే విధంగా దృఢమైన సంకేతం అవుతుంది.




# ఆంధ్రప్రదేశ్‌లో ఉగాది కానుకగా 10,060 ఉద్యోగాలు

సందేశం టైమ్స్, హైదరాబాదు, మార్చి 20 – ఆంధ్రప్రదేశ్ యువతకు ఉగాది కానుకగా ప్రభుత్వం ఉద్యోగాల పండగ ప్రకటించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 10,060 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు త్వరలో విడుదల కానున్నాయి. నోటిఫికేషన్‌లో ప్రతి పోస్టు, భర్తీ షెడ్యూల్, పరీక్షల తేదీలు, సిలబస్ వివరాలు ముందుగానే వెల్లడించబడతాయి.

ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోనే అన్ని పరీక్షలను నిర్వహించి, ప్రకటించిన పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేస్తుంది. ఉద్యోగార్థులు నైపుణ్య పోర్టల్‌లో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా అవసరమైన అలర్ట్స్ పొందవచ్చు.

ప్రతి ఏడాది ఉగాదికి ఉద్యోగాల ప్రకటన పండగను నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచిస్తూ, ఉద్యోగార్థులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పుట్ట రాజు నియామకం



సందేశం టైమ్స్, హన్మకొండ, మార్చి 20 – తెలంగాణ రాజ్యాధికార పార్టీ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పుట్ట రాజు గారికి నియామకం ఇచ్చారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది అని పార్టీ వర్గాలు తెలిపారు.

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ గారు పుట్ట రాజుకు నియామక పత్రాన్ని అందజేసి, జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పుట్ట రాజు మాట్లాడుతూ, హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించిన మల్లన్న గారికి, అశోక్ ముదిరాజ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. హన్మకొండ జిల్లాలోని ప్రతి గ్రామంలో తెలంగాణలో బీసీల ఆత్మగౌరవం, అధికారంలో వాటా సాధించడమే లక్ష్యంగా పార్టీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మల్లన్న శాసన సభలో గణాంకాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించి ఆకర్షణీయంగా ప్రసంగం

సందేశం టైమ్స్, హైదరాబాదు, మార్చి 20 – తీన్మార్ మల్లన్న శాసన మండలిలో చేసిన ప్రసంగం, గణాంకాలతో ప్రభుత్వ విధానాలను విశ్లేషిస్తూ ప్రజాస్వామ్య నిబద్ధతను చాటిన ఉదాహరణగా నిలిచింది.సభలో మల్లన్న కేవలం ఆరోపణలు చేయకుండా, ఆడిట్ నివేదికలు, గవర్నర్ ప్రసంగాలు, సామాజిక-ఆర్థిక విశ్లేషణల వంటి అధికారిక పత్రాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ గణాంకాలలోని వ్యత్యాసాలను ఎత్తిచూపడం ఆయన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడాన్ని సూచించింది.మల్లన్న తార్కిక విశ్లేషణతో, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల కోసం అవసరమైన వృద్ధి రేటును వివరించి, భావోద్వేగాల కంటే గణాంకాలతో వాదించడం ద్వారా ప్రసంగానికి బలం చేకూర్చాడు. బీసీ ఉపరిపథకం, మరుగుదొడ్ల నిధులు, అనాథ పిల్లల విద్యా వసతులు వంటి సున్నితమైన అంశాలను నిర్భయంగా ప్రస్తావించడం, సాధారణ ప్రజల గొంతుగా తనను నిలిపాడు.అతను గత ప్రభుత్వ లోపాలు, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను పోల్చి, "అప్పుడు తప్పు అంటే ఇప్పుడు కూడా తప్పే" అని చెప్పడం, రాజకీయ నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ప్రసంగం ఒక "సమగ్ర విశ్లేషణ" లాంటి రీతిలో, ఆవేశం కంటే ఆలోచన రేకెత్తించే విధంగా సాగింది.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష సభ్యులు గణాంకాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆరోగ్యకరమైన పరిణామమని తెలిపారు.

# శక్తి భద్రతతో అభివృద్ధికి కొత్త దిశ – కేంద్ర ప్రభుత్వం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 20, ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం దేశంలో శక్తి భద్రతను పునరుద్ధరించడం ద్వారా అభివృద్ధి వేగానికి కొత్త దిశ అందిస్తున్నది. వృద్ధిచెందుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఉష్ణ, జలశక్తి మరియు అణు విద్యుత్ రంగాలలో భారీ పెట్టుబడులు పెట్టి శక్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, దేశాన్ని స్వావలంబన వైపుకు మరింత వేగంగా నడిపిస్తున్నది. కేంద్ర వర్గాలు వెల్లడించినట్లు, ఈ సన్నాహాలు భవిష్యత్తులో భారతాన్ని బలమైన, సుస్థిరమైన శక్తి శక్తిగల దేశంగా రూపొందించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.

# మహారాష్ట్రలో జ్యోతిష్యుడు అరెస్ట్ – లైంగిక వేధింపుల కేసులో సంచలనం



సందేశం టైమ్స్, నాసిక్, మార్చి 20, ప్రతినిధి: మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన జ్యోతిష్యుడు, న్యూమరాలజిస్ట్ అశోక్ కారత్ లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యాడు. 2022 నవంబర్ నుంచి 2025 డిసెంబర్ వరకు 35 ఏళ్ల మహిళపై లైంగిక దాడులు చేశాడని ఆరోపణలు వచ్చాయి.పోలీసులు వివరణలో వెల్లడించినట్లయితే, బాధిత మహిళలకు మత్తుమందు ఇచ్చి దాడులు చేసి, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసినట్లు గుర్తించారు.పోలీసుల విచారణలో మొత్తం 58 అసభ్య వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. అశోక్ కారత్‌పై భారతీయ న్యాయసంహిత సెక్షన్ 64 కింద అత్యాచారం, ఇతర సంబంధిత కేసులు నమోదు అయ్యాయి. రాజకీయ, సామాజిక వర్గాల్లో ఈ ఘటనపై తీవ్ర స్పందన వ్యక్తమవుతోంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# హోర్ముజ్ సమీపంలో భారత నౌకాదళ మోహరింపు – చమురు రవాణాకు భద్రత




సందేశం టైమ్స్, మార్చి 20, ప్రతినిధి: హోర్ముజ్ జలసంధి సమీపంలో భారత నౌకాదళం చమురు ట్యాంకర్లను భద్రపరచడానికి అరడజు యుద్ధనౌకలను మోహరించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్ మరియు అరేబియా సముద్రంలో భారతదేశం తానిదేని ఇంధన మార్గాలను రక్షించడంలో నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తోంది.సంకేతాల ప్రకారం, పర్షియన్ గల్ఫ్‌లో 1,000 కంటే ఎక్కువ నౌకలు చిక్కుకుపోయాయి. ఈ వారాంతం నుంచి కనీసం 23 చమురు ట్యాంకర్లను భద్రతగా తరలించడానికి భారత నౌకాదళం చర్యలు చేపట్టింది. ఇప్పటికే 2 భారతీయ ఎల్పిజి ట్యాంకర్లు క్లియర్ చేసి పంపిణీ చేశారు.భారత నావికాదళం డిస్ట్రాయర్లు, ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకలను ఎస్కార్ట్ కోసం మోహరించి, ఎస్కలేషన్ లేకుండా సరుకుల భద్రతను నిర్ధారిస్తోంది. ఇరాన్, రష్యా వంటి ప్రధాన చమురు సరఫరాదారులతో ఉన్న సంబంధాలను, పశ్చిమ ఆసియా అంతటా దౌత్య పరిధిని ఆధారంగా తీసుకుని భారత్ 85 శాతం ఇంధన దిగుమతుల భద్రతను నిర్ధారిస్తోంది

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.